క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబుకు సన్మానం



జిల్లా అధికార ప్రతినిధి రాంబాబును సన్మానిస్తున్న యూనియన్‌ నాయకులు

ఏలేశ్వరం: వైఎస్సార్‌ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులైన సుంకర రాంబాబును పట్టణంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణ ఎలక్ట్రికల్‌, ప్లంబింగ్‌, రివైండింగ్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో రాంబాబును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ ముద్రగడ గిరిబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు రాజు, ప్రకాశం, వీరబాబు, రమేష్‌, రమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఆదిత్య యూనివర్సిటీలో రక్తదానం చేస్తున్న జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత గంగాధర్‌

గండేపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

రక్తదానానికి యువత ముందుకు రావాలని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, పెద బ్రహ్మదేవం శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు తోటకూర గంగాధర్‌ పిలుపునిచ్చారు. వేసవిలో రక్తం నిల్వల కొరతను నివారించేందుకు ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. తాను 30వ సారి రక్తదానం చేస్తున్నట్టు తెలిపారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



వి.కొత్తూరు వద్ద హైవేపై ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

తుని రూరల్‌: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. తుని మండలం వి.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై పశు సంవర్ధక శాఖ సచివాలయ సక్రటరీ దుర్గాప్రసాదు మృతి చెందడంతో ఆ స్థలాన్ని డీఎస్పీ పరిశీలించారు. రూరల్‌ సీఐ జి.చెన్నకేశవరావు, పట్టణ సీఐ గీతా రామకృష్ణ, ఎస్సై బి.కృష్ణమాచారి పాల్గొన్నారు.

ఘనంగా కార్ల్‌ మార్క్స్‌ జయంతి

జగ్గంపేట: ప్రపంచ గతిని మార్చిన తత్వవేత్త, శ్రామికుల ఆశాజ్యోతి, సమ సమాజ నిర్మాణ సిద్ధాంత కార్ల్‌ మార్క్స్‌ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగవల్లినగర్‌లో ఆంధ్రప్రదేశ్‌ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నేతలు కార్ల్‌ మార్క్స్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రామికుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నేత వీరాంజనేయులు, సంఘం జిల్లా నేతలు వల్లూరి రాజబాబు, బి.రమేష్‌, కుంచే అంజిబాబు, కడితి సతీష్‌ పాల్గొన్నారు.

దొరికినంత దోచెయ్‌..!

- ఇళ్ల పట్టాల పేరుతో తమ్ముళ్ల చేతివాటం
- లబ్ధిదారుల నుంచి డబ్బు వసూళ్లు
- గగ్గోలు పెడుతున్న పేదలు



ఏలేశ్వరంలోని జగనన్న కాలనీ

ఏలేశ్వరం: తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. డబ్బే పరమావధిగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ప్రజల నుంచి దొరికినంత దోచేస్తున్నారు. పేద ప్రజలకు సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి ఆశించకుండా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాలకు ఉచితంగా పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ పెద్దలు లబ్ధిదారుల నుంచి ఎలా డబ్బులు వసూలు చేయాలనే పనిలో పడ్డారు. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో 2507 మందికి పట్టాలు ఇవ్వగా వీరిలో 258 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. 214 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు తెలుగు తమ్ముళ్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

ఇంటికి రూ.5 వేలు

ఇంటి నిర్మాణం చేపట్టాలంటే గతంలో ఇచ్చిన జగనన్న పట్టా పనికిరాదని లబ్ధిదారులను బెదిరిస్తున్నారు. గతంలో ఇచ్చిన పట్టా స్థానంలో కొత్తగా మరో పట్టా ఇవ్వాలని దానికి ఖర్చవుతుందని లబ్ధిదారులను డిమాండ్‌ చేస్తున్నారు. అధికారం చేపట్టగానే నగర పంచాయతీలోని ఒక్కో వార్డుకు ఒక నాయకుడిని ఇన్‌చార్జ్‌గా నియమించుకున్నారు. వారు తమ పరిధిలోని లబ్ధిదారుల నుంచి రూ.5 వేల లోపు డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వం అని ఎదురు తిరిగితే ఇళ్ల నిర్మాణం జరగకుండా చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేయిస్తామని బుకాయిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తున్నారు.



లబ్ధిదారుడికి ఇచ్చిన టీడీపీ గుర్తింపు కార్డు

డబ్బు చెల్లించిన వారికి టీడీపీ గుర్తింపు కార్డు

పట్టా నిమిత్తం డబ్బులు చెల్లించిన వారికి టీడీపీ గుర్తింపు కార్డు ఇస్తున్నారు. త్వరలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినప్పుడు గుర్తింపు కార్డు చూపిస్తే మొదటి ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో స్థలంతో పాటు ఇళ్లు ఇచ్చినా ఒక్కపైసా ఇవ్వలేదని ఇప్పుడు కొత్త పట్టాల పేరుతో డబ్బులు బలవంతంగా వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవు

ప్రస్తుతం ఉన్న ఇళ్ల పట్టాల స్థానంలో కొత్తవి ఇస్తామని ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న పట్టాలు అమలులో ఉన్నాయి. ఆ పట్టాలకు ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయి.

– ఎం.సత్యనారాయణ, కమిషనర్‌, ఏలేశ్వరం నగర పంచాయతీ

అన్యాయంగా వసూళ్లు



జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలకు అన్ని అనుమతులు ఉన్నాయి. లబ్ధిదారుల నుంచి కొందరు అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారులు డబ్బులు ఇచ్చే ముందు అధికారుల దృష్టికి తీసుకువెళ్లండి.

– సామంతుల సూర్యకుమార్‌, మాజీ మున్సిపల్‌ కౌన్సిలర్‌, ఏలేశ్వరం

రైతులను తక్షణమే ఆదుకోవాలి

వైఎస్సార్‌ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్‌ ముద్రగడ గిరిబాబు



కిర్లంపూడి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్‌ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ ముద్రగడ గిరిబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు నియోజకవర్గంలోని అరటి, మామిడి, జీడిమామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దీంతో రైతులు తమ పొలాలకు పెట్టిన పెట్టుబడి వృథాగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయంలో రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసేదని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటనష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. వరి పండించిన రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

పార్టీ విజయానికి సమన్వయంతో పని చేయాలి

మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ కో ఆర్డినేటర్‌ తోట నరసింహం



జగ్గంపేటలో తోటను కలసిన సోమవరం గ్రామ నూతన కమిటీ సభ్యులు

కిర్లంపూడి: వైఎస్సార్‌ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ తోట నరసింహం సూచించారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయనతో పాటు యువ నాయకుడు తోట రాంజీని సోమవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలశారు. తోట నరసింహం ఆదేశాలతో ఇటీవల వైఎస్సార్‌ సీపీ సోమవరం గ్రామ నూతన కమిటీని ఎంపిక చేశారు. దీంతో పార్టీ నేత అడబాల నాగు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు నరసింహాన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు అంబటి కొండలరావు, నర్రా రాజు, బొండ శివగంగాధర్‌, గాబు చక్రరావు, కాకర అప్పన్న, చింత నూకరాజు, సుంకు రాంబాబు, బోను లోవరాజులను తోట నరసింహం, రాంజీ పూలమాలలతో సత్కరించారు.

చంద్రబాబు హయాంలో స్కాం ఉంటేనే స్కీం

- కుట్టు మెషీన్ల పేరుతో రూ.150 కోట్ల దోపిడీ
- మండిపడిన వైఎస్సార్‌ సీపీ నేత యనమల కృష్ణుడు, బీసీ నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యనమల కృష్ణుడు, బీసీ నాయకులు

తుని: స్కీంల పేరిట స్కాంలు చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు యనమల కృష్ణుడు ఘాటువ్యాఖ్యలు చేశారు. ఎస్‌.అన్నవరంలోని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం బీసీ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లక్ష మంది బీసీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ పేరుతో రూ.221 కోట్లతో పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఒక్కో కుట్టు మెషీన్‌కు రూ.4,300, శిక్షణకు రూ.3 వేలు చొప్పున ఒకొక్కరికి రూ.7,300 ఖర్చు చేస్తామని చెప్పారన్నారు. కాగా లక్ష మందికి రూ.75.06 కోట్లు అవుతుందని, మిగిలిన 150 కోట్లకు లెక్కలు లేవన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాన్ని బీసీలు గమనించాలన్నారు. బీసీలకు మేలు చేస్తున్నామని చెప్పి ప్రజల సొమ్ము దోచుకుంటే చూస్తు ఊరుకోమని, వైఎస్సార్‌ సీపీ దీనిని ప్రజలకు వివరిస్తుందన్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్‌ కుటుంబం

దివంగత నేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి ప్రజలకు మేలు చేసే పథకాలను అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేశారని, 2019–24 వరకూ వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచారని వైఎస్సార్‌ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జి అన్నారు. వైఎస్సార్‌ సీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిందన్నారు. టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా స్కాంలకు అడ్డాగా మారిందని విమర్శించారు. వైఎస్సార్‌ సీపీ ప్రజల తరపున రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్‌ సహాయ కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, తుని నియోజకవర్గ బీసీ సెల్‌ అధ్యక్షుడు పెండ్యాల రామకృష్ణ, రాష్ట్ర బూత్‌ కమిటీ ప్రధాన కార్యదర్శి బెక్కం చంద్రగిరి, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్‌, తొండంగి మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల వీరబాబు, తుని, కోటనందూరు మండల కన్వీనర్లు దుంగల నాగేశ్వరరావు, చింతకాయల చినబాబు, రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి మడదా హేమంత్‌, చింతల రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఆందోళన



ప్రత్తిపాడు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (ఏపీటీఎఫ్‌) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పాఠశాలల విధ్వంస విధానాలకు వ్యతిరేకంగా ప్రత్తిపాడు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్‌ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లబిల్లి శ్రీనివాస్‌ మాట్లాడుతూ 1 నుంచి 5వ తరగతులను మోడల్‌ ప్రాథమిక పాఠశాలలుగానే కొనసాగించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు కొనసాగుతున్న చోట, 6, 7 తరగతులున్న చోట నాలుగు స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు, 6, 7, 8 తరగతులున్న చోట ఆరు స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులను కేటాయించాలన్నారు. పెరిగిన జనాభాను అనుగుణంగా మున్సిపల్‌, కార్పొరేషన్‌ ప్రాంతాల్లో నూతనంగా వెలిసిన ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి, ఐఆర్‌ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలని నల్లబిల్లి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌ ఎం.సూర్యప్రభకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు గోరస దుర్గాప్రసాద్‌, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల నాయకులు వెన్నా శ్రీనివాస్‌, శ్రీరామ్‌, కేఎస్‌ సుబ్రహ్మణ్యం, బి సత్యప్రసాద్‌, జి.సత్యప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ గాబు సంబరం



గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌ సీపీ నేత మురళీకృష్ణంరాజు, తదితరులు

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని రాచపల్లిలో గంగాలమ్మతల్లి గాబు సంబరం సోమవారం ఘనంగా జరిగింది. ఒమ్మి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూడేళ్లకు ఒక్కసారి గాబు సంబరాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి సారె, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెట గుళ్లు, సువ్వారాట స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ నరసాపురం పార్లమెంట్‌ నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒమ్మి కుటుంబ సభ్యులు గంగరాజు, చక్రం, పెద్దబ్బాయి, సత్తిబాబు, నూకరాజు, బాబ్జి, రమణ, నాగు, రాజు గ్రామ సర్పంచ్‌ సారపల్లి లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గజ్జనపూడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 16 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్‌: చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఆ స్నేహితులు సోమవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మండలంలోని గజ్జనపూడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు సుమారు 16 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వి.వీరరాఘవరెడ్డి, లోవరాజు, రాంజీప్రసాద్‌, శ్రీనివాసరావులను పూలమాలలు, శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. చివరగా గ్రూప్‌ ఫొటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉలుసు శ్రీను, గెడ్డం నాగేశ్వరరావు, బొట్టా శ్రీను, సతీష్‌, సుందరపల్లి సత్య, గౌరీ పార్వతి, బర్ల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తునిలో తహసీల్దార్‌ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎన్‌ఎంయూ కార్మికులు



ఏలేశ్వరంలో వినతిపత్రం అందజేస్తున్న యూనియన్‌ నాయకులు

తుని: దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ నేషనల్‌ మజ్దూర్‌ యూనిటీ అసోసియేషన్‌ నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఎన్‌ఎంయూ తుని డిపో కార్యదర్శి సాయిరామ్‌ ఆధ్వర్యంలో కార్మికులు రెడ్‌ రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ర్యాలీగా తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/9 సర్క్యులర్‌ అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌ కేర్‌ లీవ్‌ పొజిషన్‌ మెరుగుపర్చాలని, కొత్త బస్సులు కొనుగోలు, ఉద్యోగ నియమకాలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. గ్యారేజీ మెకానిక్‌లపై పని భారం తగ్గించాలన్నారు. డ్రైవర్లకు పెంచిన విధంగా నైట్‌అవుట్‌ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. పనిభారం, ఒత్తిడి తగ్గించాలని కోరారు. కార్మికులందరికీ ఒకే విధానం అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా యాజమన్యం పట్టించుకోలేదన్నారు. సమ్యలు పరిష్కరించే వరకూ ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్‌ డీఎస్‌ బాబా, గ్యారేజీ కార్యదర్శి చంద్రశేఖర్‌, పీడీ కుమార్‌, జీవీ బాబు, సీహెచ్‌వీ ప్రసాద్‌, అమీర్‌, అప్పారావు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని వినతి

ఏలేశ్వరం: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని నేషనల్‌ మజ్దూర్‌ యూనిటీ అసోసియేషన్‌ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ కుశరాజుకు సోమవారం యూనియన్‌ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 58 డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశామన్నారు. వీటిలో ఉద్యోగ భద్రత, 1/2019 సర్క్యులర్‌ అమలు తదితర డిమాండ్లు ఉన్నాయన్నారు. వీటిపై పలుమార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.త్రిమూర్తులు, కె.కామేశ్వరరావు, ప్రవీణ్‌, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

చివరికి కష్టాలు

- అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యం
- పంట ఒబ్బిడిలో అన్నదాత బిజీబిజీ

ప్రత్తిపాడు: అకాల వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ప్రత్తిపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. నూర్పిన ధాన్యం కళ్లాల్లోనే తడిసిముద్దయ్యింది. ప్రత్తిపాడు మండలంలో 1,400 ఎకరాల్లో రబీ సాగు జరిగింది. రైతులు ఎక్కువ శాతం బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్‌ 15048, సాధన రకం (సన్నాలు) వంగడాలనే పండించారు. ప్రభుత్వం సకాలంలో రైతులకు గోనె సంచులు సరఫరా చేయకపోవడంతో ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు. అకాల వర్షానికి మండలంలోని ఏలూరు, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. పెదశంకర్లపూడిలో రాసంశెట్టి రాజా తదితర రైతుల పంట తడిసి మొలకలు కూడా వచ్చేశాయి. కూటమి ప్రభుత్వం కేవలం కొద్దిమంది రైతులకే గోనెసంచులు అందజేయడంతో వారు మాత్రమే ధాన్యాన్ని మిల్లులకు తరలించగలిగారు. కొన్ని చోట్ల బరకాలు కప్పినా ధాన్యం తడిచిపోయింది. ముందుగా కోరిన రైతులకు గోనె సంచులు ఏర్పాటు చేశామని వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వచ్చింది. చేతికి అందివచ్చిన పంట కళ్ల ముందే తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన పంటను సోమవారం ఆరబెట్టి ఒబ్బిడి చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



పెదశంకర్లపూడిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

రైతు సంఘాల నాయకుడిపై దాడి అమానుషం



రంపయర్రంపాలెంలో మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: ఆలిండియా రైతు సంఘాల నాయకులు రాకేష్‌ తికాయత్‌పై ముజాఫర్‌నగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ నాయకుల దాడి అమానుషమని ఆంధ్రప్రదేశ్‌ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో సోమవారం మేడే వారోత్సవాలను నిర్వహించారు. కర్నాకుల కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న ముజాఫర్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో రాకేష్‌ తికాయత్‌ ప్రసంగించాల్సి ఉండగా ఆర్‌ఎస్‌ఎస్‌ శక్తులు దాడికి పాల్పడ్డాయన్నారు. ఈ దాడిపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్‌, సీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్‌, గోలి ముసలయ్య, శ్రీకాంత్‌, బుజ్జి, రమణ, అబ్బి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక పర్వత సుబ్బాయమ్మ ఆసుపత్రిని సోమవారం ఆయన సందర్శించారు. డయేరియా వ్యాధి నివారణకు తీసుకున్న చర్యలపై వైద్యాధికారులు ఆర్‌వీవీ సత్యనారాయణ, శెట్టిబత్తుల రాజీవ్‌ను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం మెరుగు పచ్చాలని ఎంపీడీఓ ప్రసాద్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, సర్పంచులు రామిశెట్టి ఏసుబాబు, ఎంపీటీసీ చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.